
క్లుప్తంగా

పోటీపరీక్షల అభ్యర్థులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ స్టడీ సెంటర్‌లో పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ సైకాలాజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ సందర్భంగా టీపీఏ క్యాలెండర్ ఆవిష్కరించారు. టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నారాయణను అభినందించారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఎస్సైగా రాజేశ్



శ్రీరాంపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా రాజేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన మానస బదిలీ కాగా ఆమె స్థానంలో రాజేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాజేశ్ ఇంతకు ముందు పెద్దపల్లి ఎస్సైగా పని చేశారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

కాసిపేట: మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా బుధవారం వి.ప్రభాకర్ మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన దామోదర్ స్థానంలో తాండూర్ ఎంఈఓగా పనిచేస్తున్న ప్రభాకర్‌కు పూర్తిస్థాయి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓలను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది సీసీవో రాంబాబు, ఎంఐఎస్ సౌజన్య, సీఆర్పీలు తిరుపతి, వకులదేవి, ఐఈఆర్పీ శ్రీలత, శ్రీరాములు తదితరులున్నారు.

'దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

పాతమంచిర్యాల: బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావుపై భూతగాదా విషయంలో దాడి చేయడానికి ప్రయత్నించిన మట్టపెల్లి జయరామారావుపై చర్యలు తీసుకోవాలని నేతకాని సంఘం నాయకులు దుర్గం ఎల్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దురుద్దేశంతో నీలకంఠేశ్వర్‌రావును కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపించారు. ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సబ్సిడీ వరి విత్తనాలు సరఫరా చేయాలి

భీమారం: వర్షాకాలంలో వరిపంట సాగు చేసేందుకు ప్రభుత్వపరంగా సబ్సిడీ విత్తనాలను అందించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్లో లభిస్తున్న వరి విత్తనాలు తీసుకుంటే వాటితో సరైన నారు రావడంలేదని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకొని వరిపంటకు అవసరమైన విత్తనాలను జూన్ నెల మొదటివారంలో సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబల్ కమిషన్‌కు ఫిర్యాదు



కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీతో జరిగే నష్టాల గురించి బుధవారం ఆదివాసీ నాయకులు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబల్స్ సభ్యుడు అనంతనాయక్‌ను ఉట్నూరులో కేబీ కాంప్లెక్స్‌లో కలిసి వివరించారు. దేవాపూర్‌లో ఆదివాసీలను మభ్యపెట్టి 40ఏళ్ల క్రితం 350కోట్లతో ప్రారంభమైన కంపెనీ 7యూనిట్లకు విస్తరించి 30వేల కోట్ల లక్ష్యం చేరుకుందన్నారు. ఆదివాసీ యువతకు దక్కింది ఏమి లేదని, ఇప్పటివరకు స్థానికులకు ఉద్యోగాలు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. ఓరియంట్ కంపెనీ ఆదివాసీలకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఏమి చేయకుండా 40ఏళ్లు మోసం చేసినందునా ఓరియంట్ లీజ్ రద్దు చేసి ట్రైబల్ సొసైటీ మీద లీజ్ ఇవ్వాలని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి వెయ్యి కోట్లు డిపాజిట్ చేయాలని సూచించారు. 40సంవత్సరాలు మభ్య పెట్టి మోసం చేసినందునా, యాజమాన్యంపై అట్రాసిటీ కేసునమోదు చేయాలని కోరారు. డీఎంఎఫ్‌టీ నిధుల కెటాయింపు జిల్లాలు దాటి కెటాయిస్తు అన్యాయం చేసినందునా, ఇన్ని రోజులు ఖర్చు చేసిన నిధులపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరినట్లు తెలిపారు.

నిఘా నేత్రంపై నిర్లక్ష్యం!



దొనబండలో జాతీయ రహదారిపై నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- మరమ్మతులకు నోచుకోక అలంకారప్రాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో పనిచేయడం లేదు. నేరాల నియంత్రణకు రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై ఏర్పాటు చేయగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. దీంతో నిఘా నేత్రాలతో నిందితులను గుర్తించడం సవాల్‌గా మారింది.

మండలంలో 100కు పైగా కెమెరాలు..

హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 13గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. నేరాల నియంత్రణలో భాగంగా 2018నుంచి పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేస్తూ వస్తుండగా, ప్రస్తుతం వాటిని పట్టించుకోకపోవడంతో మరమ్మతుల కారణంగా నిరుపయోగంగా మారాయి.

ఇటీవల జరిగిన సంఘటనలు..

- మే 4వ తేదీన నంనూర్ గ్రామానికి చెందిన రాసమల్ల అశోక్‌గౌడ్(33) జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడ్డాడు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఢీ కొన్న వాహనం గుర్తింపు ముందుకు సాగలేదు.
- మార్చి 30వ తేదీన గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిపేటకు చెందిన సంగెం శ్రీధర్(20), శ్రీహరి(14)లు అక్కడికక్కడే మృతిచెందారు.
- గుడిపేట ప్రాజెక్ట్‌కు వెళ్లే రహదారిలో నిలిపిన ట్రాలీ టైర్లు, నంనూర్‌లోని ఓ టిప్పర్ టైర్లు గుర్తు తెలియని దొంగలు దొంగిలించారు.
- పలు మండలాల పరిధిలోని పదుల సంఖ్యలో గొర్లు, మేకలు, బర్రెలు, మోటారు సైకిళ్లు గుర్తు తెలియని దొంగల చేతుల్లో దొంగతనాలకు గురి అవుతున్నాయి. ఈ దొంగతనాలు సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేసి ఉంటే దొంగల గుర్తింపు త్వరగా జరిగి కేసులు పరిష్కారం జరిగేవి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం..



పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోనే కాకుండా జాతీయ రహదారులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అన్ని కూడా పనిచేసేలా చూస్తాం. పనిచేయని సీసీ కెమెరాలు మరమ్మతు చేయించడం, అవసరమైతే కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు దాతల సహకారం తీసుకుని మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూస్తుండగా వేంపల్లి, ముల్కల్ల, గుడిపేటలో ఇటీవల 10 కెమెరాలు ఏర్పాటు చేయించాం. వారం రోజుల్లో సీసీ కెమెరాల భిగింపు పూర్తి చేసి పనిచేసేలా ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడుతాం.

– నరేశ్‌కుమార్, ఎస్సై, హాజీపూర్

నిందితుల గుర్తింపులో జాప్యం..

నిఘా కెమెరాలు నిదరోతుండటంతో నిందితుల గుర్తింపులో జాప్యం జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతుండటంతో ఆ నేరాలకు పాల్పడిన వారిని గుర్తుపట్టేందుకు కనీస ఆధారమైన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో స్టేషన్‌లో పలు కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. నిందితులను గుర్తించడంలో పోలీస్‌లకు సవాలుగా మారడమే కాదు, పనిచేయని కెమెరాల తతంగాన్ని అవకాశంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

పట్టించుకునేవారెవరు..

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కెమెరాలు నాణ్యమైనవి కాకపోవడం, తరుచూ మరమ్మతులకు గురికావడంతో పాటు విద్యుత్ హెచ్చుతగ్గులతో కూడా కాలిపోతూ కెమెరాలు పనిరాకుండా పోతున్నాయి. వాటిని మరమ్మతులు చేసేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. నెలలు గడుస్తున్నా కెమెరాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు సరికదా వాటిని అసలు పట్టించుకునే వారే లేకుండా పోయారు.

క్రీడలతో మంచి భవిష్యత్



రాంపూర్‌లో పతకాలు, ప్రశంసా పత్రాలతో విజేతలు



బహుమతులు అందుకున్న జట్టుతో ఎంపీపీ



భీమిని: గెలుపొందిన క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్ ఆవాస విద్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించడంతో పాటు క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని బయటకు తీసుకొచ్చేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు మండల స్థాయిలో ఘనంగా నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 100, 400 మీటర్ల పరుగు పందెం, జావలిన్ త్రో, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలు నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభా పాటవాలను చాటారు. చివరి రోజు జరిగిన ఫైనల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. పలువురు మాట్లాడుతూ క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు పతకాలతో పాటు ప్రశంస పత్రాలను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, ఎంపీడీఓ అబ్దుల్‌హై, తహసీల్దార్ రాజలింగు చేతుల మీదుగా అందజేశారు. పోటీలకు నిరంతర సేవలు అందించిన పడ్తనపల్లి, కర్ణమామిడి పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులను పతకాలతో సత్కరించి అభినందించారు. పోటీలకు వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్, కొట్టె మహేందర్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు వెంకటస్వామి, రాజమణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. కబడ్డీ పోటీల్లో పాతబెల్లంపల్లి జట్టు, వాలీబాల్ పోటీల్లో అంకుశం జట్టు, ఖోఖో పోటీల్లో బుచ్చయ్యపల్లి జట్టు, ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి మున్సిపాలిటీ జట్టు, పురుషుల విభాగం వంద మీటర్ల పరుగు పందెం పోటీలో బుచ్చయ్యపల్లికి చెందిన రఘుపతి, 400మీటర్ల పరుగు పందెం పోటీలో చాకేపల్లికి చెందిన రమేష్, వంద మీటర్ల మహిళా విభాగం పరుగు పందెం పోటీలో మున్సిపాలిటీకి చెందిన శిరీష, 400మీటర్ల పరుగు పందెంలో మున్సిపాలిటీకి చెందిన శ్వేత విజేతలుగా నిలిచారు. గెలుపొందిన జట్లకు ఎంపీపీ శ్రీనివాస్ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయిలో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ రావు, సర్పంచ్ రాజమొగిళి, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, పీఈటీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

భీమిని: క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని ఏఎంసీ చైర్మన్ బోనగిరి నిరంజన్‌గుప్తా, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అన్నారు. మండల స్థాయి సీఎం కప్ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. పరుగుపందెం, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో వెంకటాపూర్ యువత వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. కార్యక్రమంలో ఎంపీఓ సబ్దర్‌ఆలీ, ప్యాక్స్ చైర్మన్ నారాయణ, వైస్ ఎంపీపీ మధు, సర్పంచ్ ఎల్లాగౌడ్, పీఈటీ వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

శ్రీరాంపూర్: క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల పోటీతత్వం పెరుతుందని, ఆటల్లో రాణించాలనుకునే వారు నిత్యం ప్రాక్టీస్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు పూదరి కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ రాంచందర్, మారయ్యలు పాల్గొన్నారు.

అగ్నికి మామిడి వనం ఆహుతి



కాలిపోయిన మామిడి చెట్లు

జైపూర్: మండలం కిష్టాపూర్ పంచాయతీ పరిధిలోని రుమ్మిపూర్ శివారులో మామిడి తోట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం అయ్యాయి. కిష్టాపూర్ గ్రామానికి చెందిన అలువెల్లి రమేశ్‌రెడ్డికి చెందిన సుమారు 30 చెట్లకు పైగా కాలిపోగా సుమారు రూ.3లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు వా పోయారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగలు సరిగ్గా లేకపోవడం, గాలి వచ్చినప్పుడల్లా వైర్ల మధ్యన రాపిడి జరిగి మంట లేసినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరాడు.

జైపూర్‌లో మామిడి, వరి దగ్ధం..

జైపూర్ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ఇరిగిరాల రాజబాపుకు చెందిన మామిడి తోటలో బుధవారం మధ్యాహ్నం ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగలు తాకడంతో నిప్పురవ్వ వచ్చి మామిడి చెట్లపై పడటంతో 10మామిడి చెట్లు దగ్ధం అయ్యాయి. మంటలు చెలరేగుతూ మామిడి చెట్ల సమీపంగా ఉన్న వరి పంటలకు వ్యాప్తి చెందడంతో 10గుంటల వరి పంట కాలిపోయినట్లు బాధితులు రాజబాపు తెలిపారు. స్థానికుల సమాచారం ద్వారా స్పందించిన ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు.

జనావాసాల్లో జాతీయ పక్షి





అడవిలో ఉండాల్సిన జాతీయ పక్షి జనావాసాల్లో చేరింది. మనుషులతో, కోళ్లతో కలిసి జీవిస్తోంది. జన్నారం మండలం దొంగపల్లి గ్రామం అడవికి సమీపంలో ఉండటంతో అడవిలో ఉండే నెమలి జనావాసాల్లోకి చేరి అలవాటు పడింది. ఇళ్లలోనే ఉంటూ గిరిజనులు వేసే గింజలు తింటూ జనాలతో కలిసి ఉంటుంది. ఇళ్లలో పెంచుకునే కోళ్లతో కలిసి తిరుగుతుంది. నెమలికి ఎలాంటి హాని చేయకుండా గ్రామస్తులు మంచిగా చూసుకుంటున్నారు.

– జన్నారం

సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): టీఎన్జీఓస్ జిల్లా సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైన మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌లను బుధవారం హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీఓస్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతీనెల 1వ తేదీన ప్రభుత్వం వేతనాలు చెల్లించేలా చూడాలని, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



సూచనలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

దండేపల్లి: మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు, గ్రామంలోని పలు కాలనీలు, నర్సరీ, డంపింగ్ యార్డ్‌ను డీపీవో వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. రోడ్ల వెంట చెత్త ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దుకాణాల సముదాయాల ఎదుట చెత్త, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత షాపు యజమానులకు జరిమానా విధించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన మరగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందునా మురుగుకాల్వల్లో పూడిక లేకుండా పూడిక తీయించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ భూమన్న, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



రైతులతో సమావేశమైన ఏడీ అనిత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గడ్పూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ పంట సాగు ప్రాముఖ్యత, మార్కెటింగ్ అంశాలపై సహాయ వ్యవసాయ సంచాలకురాలు అనిత రైతులకు వివరిస్తూ అనుమానాలను నివృత్తి చేశారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు(జనుము, జీలుగ), విత్తనాల ఎంపికపై కూడా వివరించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు విధిగా రశీదు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు వేసుకోకుండా చైతన్యంతో ఉండాలని చెప్పారు. మ్యాట్రిక్స్ కంపెనీ సీఈఓ ఉదయ్‌కుమార్ ఆయిల్ పామ్ పంట మార్కెటింగ్, లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, మ్యాట్రిక్స్ కంపెనీ ఫీల్డ్ అధికారి శ్రీకాంత్, రైతులు చిప్పకుర్తి గట్టయ్య, బొప్ప తిరుపతి, ఇతర రైతులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు చేయించాలి

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో రైతులకు ఏఈవో సాగర్ ఖరీఫ్ సీజన్‌పై అవగాహన కల్పించారు. రైతులు తప్పకుండా తమ పంట పొలాల్లో మట్టి పరీక్షలు చేయించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతపై, సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయంపై తెలియజేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా ఆ దుకాణం నుంచి బిల్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై జీఎం బీ.సంజీవరెడ్డి అధికారులతో బుధవారం తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ప్రగతి మైదానంలో సాయంత్రం వేడుకలు నిర్వహించాలన్నారు. ఉదయం నస్పూర్ తెలంగాణ తల్లి విగ్రహం నుంచి షిర్కే చౌరస్తా, జీఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించాలన్నారు. అనంతరం తెలంగాణ అమరులకు, జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సివిల్, వర్క్‌షాప్ అధికారులను ఆదేశించారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, శివరావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

శ్రీరాంపూర్: ఉద్యోగులు తరచూ బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం జీఎం కార్యాలయంలోని ఉద్యోగులు, అధికారులకు బీపీ, షుగర్ వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు జబ్బులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓ టు జీఎం గోపాల్ సింగ్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు,ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు,చిరంజీవులు,ఎన్విరాన్‌మెంట్ అధికా రి హనుమాన్‌గౌడ్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఏ రియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'మ్యాగ్జిన్ స్టోర్‌ను మార్చాలి'

■ బొగ్గుబాయి వార్తలు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు సంబంధించిన మ్యాగ్జిన్ స్టోర్‌ను మార్చాలని సీఐటీయూ బ్రాంచీ అధ్యక్షుడు శంకర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మ్యాగ్జిన్ గనులకు చాలా దూరంలో ఉందని, దారి వెంట సరిగ్గా లైట్లు కూడా లేకపోవడంతో రాత్రి షిఫ్ట్‌లో కార్మికులు మ్యాగ్జిన్ తీసుకొచ్చేటప్పుడు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి గనులకు సమీపంలో మ్యాగ్జిన్ స్టోర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో సింగరేణి ఆధ్వర్యంలో పర్యావరణ పరిక్షణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించగా, ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఎంవీటీసీలో ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, కాలుష్యరహిత సమాజ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సహకరించాలన్నారు. ర్యాలీలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ ప్రభాకర్, యూనియన్ల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

'రక్షణాధికారిపై దాడి అమానుషం'

మందమర్రిరూరల్: ఇల్లందు ఏరియాలోని రక్షణాధికారి శివకుమార్‌పై జరిగిన దాడి అమానుషమని సింగరేణి అధికారుల సంఘం మందమర్రి ఏరియా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

సమీక్ష సమావేశం

మందమర్రిరూరల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఏరియా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, ఏరియా ఇంజినీర్ నాగరాజ్ ఉన్నారు.

వీవోఏల నిరసన

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు చేస్తున్న సమ్మె 31వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా బుధవారం సమ్మె శిబిరానికి చేరువలో ఉన్న పోచమ్మ గుడి వద్ద కొబ్బరి ముక్కలు పోగు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.